# సైజువారీ అధికారాలు

కె. ఆర్. రెడ్డి

రైలు పెట్టెలోంచి దిగీ దిగగానే 'హాఛ్' మని తుమ్మేశాడు అప్రాచ్యుడెవడో. హతోస్మి! అంటూ అర్థనిముషం నిట్టూర్చి చేతులను 'x' మార్కు చేసి రెండు చెవులూ గట్టిగా మూసేసుకున్నాడు తుమ్ములమీద తూమెడు నమ్మకమున్న తూపాటి నారాయణశెట్టి, ఇవాళ ఎట్టి కఠోర దృశ్యాలు కానవగునోగదా అని కష్టపడిపోతూ.

"నందామయా గరుడ నందామయా!
ఆనందదేవికీ నందామయా
అధికారయోగంబు-అధికమయ్యేటపుడు
అజ్ఞానతిమిరాలు-అలిమేనయా!
ముందువెనుకలు కనని-ముక్కోపమెప్పుడూ
ముక్కుమీదనె నాట్య మాడేనయా!

అయ్యా! ఒక కాలణా ధర్మం వేయండి నాయనలారా! కళ్ళుకానని కబోదిని కనికరించండి తండ్రులారా!" అంటూ ఒక ఓటుకంబురను గోటి నిండా మీటుకుంటూ అడ్డుతగిలాడు పరబ్రహ్మం ఒకడు.

"భలే! నవ్యకవిత్వంలో శాణ్యం దిద్దావురా గురుడా!" అనేసి ఆముదం ముహంలో ఆశ్చర్య మొలికిస్తూ అర్థణా విసిరేశు ఆంజనేయ శర్మ, తను అర్థ సంవత్సరంగా అహోరాత్రులూ ఆరాధన చేస్తూ కాగితాలన్నీ ఖరాబుచేసి పత్రికలపైన పారవేసిన నవ్యసాహిత్యముకన్నా యిదే నయంగా వుంది అని విస్తుపోతూ. (వానిలో ఏ ఒక్కటీ ప్రచురణ కాలేదనుకోండి. అది స్వగతము.)

"ఎటొచ్చీ రాష్ట్రి రాష్ట్రికీ కొద్దిమంది చదువుకున్న బిక్షగాళ్ళు వుండి తీరాలోయ్! ఇలా నీతికి సానలుపెట్టి-పాటకు ప్రతిపాటలైనా కూరుస్తుంటారు." ఏమంటావ్ అన్నట్టు కొశ్చెన్ మార్కు ముహం పెట్టాడు కృష్ణమాచారి.

"ఇక మాటలు చాలించి నడవండయ్యా ట్రాకు వద్దకు" అన్న గురువతంసముగారి గదమాయింపుతో శిష్య పరమాణువు లందరూ నోళ్ళకు తాళముపెట్టి కాళ్ళకు కట్లు విప్పేశారు క్రమబద్ధంగా కదిలిపోతూ.

• • •

రైల్వే ట్రాకు నిర్మాణాన్ని గూర్చి సాకల్యంగా చర్చించాక 'పాయింట్స్ అండు క్రాసింగ్స్'లోని పరమ రహస్యాన్ని వివరిస్తున్నారు పరబ్రహ్మంగారు. (ట్రాకు యిన్స్పెక్టరు) 'స్టాక్ రెయిలుకూ టంగ్ రెయిలుకూ మధ్య ఏపాటి సందువున్నా రైలు బండికి ప్రమాదము సంభవిస్తుంది. కాబట్టి స్విచ్చి మూలంగా...' అంటూ ఏకధాటిని ఒక లెక్చరు దంచి పారేస్తూంటే, పానకంలో పుడకలాగా 'సార్! డి. ఐ. గారు పిలుస్తున్నారు సార్.' అంటూ అంగ మీద అంగ చాచుకుని అంగలారుస్తూ దయ చేశాడు ఒక అంకాళప్ప.

పక్కనే ప్లాటుఫారము మీద నుంచున్న డి. ఇ. గారిముందు కాలు కాలిన పిల్లిపిల్లలా ఒదిగి నుంచున్నాడు పరబ్రహ్మం.

"ఉదయంనుంచీ ఏమి చేస్తున్నావయ్యా? ట్రాకు ఫిట్టింగు గాంగువద్ద ఒక్క మేస్త్రీకూడా లేదు. ఇలా కళ్లుమూసుకుని పనులుచేయడం మొదలెడితే..."

"స్టూడెంట్లకు ట్రాకు కన్స్ట్రక్షను వివరిస్తున్నానండి" నీళ్ళు నమిలాడు పరబ్రహ్మం.

"ట్రాకు ఇన్స్పెక్షన్ వదిలేసి ఎవరు వెళ్ళమన్నారు నిన్ను? ఎవరి పర్మిషను మీద వెళ్ళావు? ఈ మధ్య బుద్ధి మరీ గడ్డితిని పోతూంది నీకు." అగ్గిమీద గుగ్గిలం పడ్డట్టు రివ్వుమని లేచాడు డి. ఇ.

పరబ్రహ్మం ఐస్ ఫ్రూటులా కరిగి కంపించి పోయాడు.

"మీరేగదండీ...వెళ్ళమన్నారు!" నత్తిన త్తిగా నంజాడు చేతిలో చేయి తెగ నలుపుకుంటూ.

"వాట్! నేను వెళ్ళమన్నానా నిన్ను? ఉదయం నుంచీ నీ ముఖమైనా చూడందే!...మా ఉద్యోగస్తులు యీ మాత్రంలో ఏడుస్తున్నారు." హేళనాచ్ఛాదితమైన చిరునవ్వుతో చూశాడు మా వేపు.

"ఈ చీటీ కూడా ఇదిగోనండి, కాలేజి స్టూడెంట్లు యివాళ వస్తున్నారని, ఉదయంతోటే వాళ్ళకు ఎక్స్‌ప్లెయిన్ చేయటానికి వెళ్ళాలని మొన్న సాయంత్రము రాముడి చేత పంపారు దీన్ని." అంటూ చీటీ తీసి చూపించాడు పరబ్రహ్మం భయపడుతూనే.

"ఆఁ హాఁ. అలాగా? కాని ఆ గ్యాంగు దగ్గర ఒక మేస్త్రీని కూడా వుంచకుండా నీ విలా వచ్చేశావంటే ఏమిటి అర్థం? సరి! వెళ్ళి వాళ్ళకు ఎక్స్‌ప్లెయిన్ చేయి." అంటూ నిర్లక్ష్యంగా తన సంభాషణతో తనకు నిమిత్తం లేనట్టు వెళ్ళిపోయాడు డి. ఇ. (డిస్ట్రిక్ట్ ఇంజనీరు!)

"చూశారటండీ! మొన్న సాయంత్రము ఈ చీటీ పంపాడు అతడు. ఇవాళేమో మరిచి పోవడమే కాకుండా నాలోనే తప్పువున్నట్టు నానా బూతులూ తిట్టాడు. పోనీ...తనది తప్పు అని తెలుసుకున్నాకనైనా అవగింజంత అయినా ఫీలవుతాడేమో చూడండి! అలా వున్నయి మన వాళ్ళ వుద్యోగ గర్వాలు." అంటూ మా గురువతం సంతో వాపోయాడు పరబ్రహ్మం.

చప్పున నా కా చదువుకున్న బిచ్చగాడు జ్ఞాపకము వచ్చాడు "లోకం పోకడ" అంటూ ప్రక్కవాడికి కూడా పత్తా తెలియకుండా నాలో నేనే ఒక వేడి నిట్టూర్పు వదులుకున్నాను.

• • •

సివిల్ యింజనీర్ల ఆప్తబాంధవుడైన సూర్య భగవానుడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు, మాతోపాటే ఫిష్ ప్లేటును పరీక్షగా పరకాయిస్తూ.

పరబ్రహ్మం ఎండ వడకు అలసిపోయినట్టున్నాడు. అందులోనూ ఉదయంనుంచీ ఎడతెగని వీక లెక్చరు. దాహంకూడా దహించేస్తున్నట్టు అవుపిస్తోంది. 'రైల్వే ట్రాకులో జాయింటు వీక్ పాయింటు. ఫిష్ ప్లేట్లమూలంగా...' అంటూ ఏమేమో వివరించుకపోతూంటే- ఎర్రకండువాను తలపాగా చుట్టి ఎగిరి ఎగిరీ నడుస్తున్న ఎర్రన్న మేస్త్రీ 'ఏమిసార్! పిలిచారంట?' అంటూ ఎదురొచ్చి నుంచున్నాడు.

ముందే సూర్యభగవానుడి చేలిచలువకు శోషిలి పోయిన పరబ్రహ్మంగారికి అజాండమంత ఆక్రోషం నెత్తికెక్కింది.

'వెధవా! ఉదయంనుంచీ ఎక్కడ చచ్చావురా. ఆ గ్యాంగువద్ద తగలడలేకపోయావు. నీ మూలాంగా నాకొచ్చేయి నానాభూతులూను. నానాటికీ నీకు కళ్లు నెత్తికొస్తున్నాయి!' విస్ఫులింగాలు కక్కుతూన్న చింతనిప్పుల్లా వున్నాయి పరబ్రహ్మం కళ్లు.

ఎర్రన్న నోరు ఎండిపోయింది. మాటలు పెగలడం లేదు.

'మీరే కద బాబూ వెళ్ళమన్నారు? అక్కడికి వెళ్ళి...'

"ఎక్కడికి వల్లకాటికి వెళ్ళింది నువ్వు! పనిదగ్గర తగలడకుండా ఎక్కడికిరా వెళ్ళమన్నాను?" ముప్ఫైరెండుపళ్ళు పటపటలాడేయి.

ఎర్రన్న వళ్లు గజగజలాడిపోతోంది. 'నిన్న... ఉదయమేగదట... బాబూ... ఆ లెవల్ క్రాసింగ్ వద్దకు వెళ్ళి ఫిట్టింగ్సు అన్నీ... చెక్ చేసుక రమ్మన్నారు! అప్పుడే మరిచారు బాబుగోరు.' నంజాడు భయంభయంగా.

పరబ్రహ్మం ముఖం పన్నెండు రంగులు తిరిగింది. గొంతులోకడ్డ శ్లేష్మాన్ని లోపలికే మింగుకుంటూ 'ఆఁహాఁ. వెళ్ళమన్నాననుకో, ఇంతసేపూ అక్కడే తగలడితే యిక్కడేమికాను? పోనీ భోజనంచేసి త్వరగావెళ్ళు. ఊఁ!' అధికారరీత్యా ఒక ఆజ్ఞ పడవేసి మావేపు ముఖం తిప్పాడు. నెరసిన మీసాల్లోని నెరవని ఠీవిని చూశారా అన్నట్టు సగర్వంగా చూసుకుంటూ.

ఎర్రన్న ఏదో అనబోయి వెరచుకున్నట్టు వెనక్కు తిరిగి చప్పున వెళ్ళిపోయాడు, తనతోటి నడుస్తూన్న కూలివాడితో చెవిలో మూతికలిపి చప్పుడు కాకుండా ఏదో చెప్పుకుంటూ.

'చూశావా భగవన్లూ! కలికాలంలోని కాల ధర్మం?' అని నోటిమీద వేలుంచుకున్నాడు నారాయణశెట్టి.

'అవున్రా అనుమన్లూ!' అనగలిగాను నేను. అంతే.

అధికారయోగం మీద ఆ పరబ్రహ్మంగారి అమరగీతం నా గుండెల్లో గుయ్‌మంటూనే వుంది.

అరుణతాపానికి గాబోలు, 'హాచ్!' 'హాచ్!' మని అర్ధనిముషం తుమ్మేశారు ఆ ప్రాచ్యులిద్దరు మాగ్గురు. ★